

అభివృద్ధి పనులకు నేడు శంకుస్థాపన

బెంగళూరు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): నగరంలోని గోవిందరాజనగర శాసనసభా నియోజకవర్గంలో శనివారం రూ.200 కోట్ల మేరకు పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు స్థానిక ఎమ్మెల్యే ప్రియాకృష్ణ ప్రకటించారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రూ.30 కోట్లతో పార్కు నిర్మాణం, రూ.30 కోట్లతో వైట్‌టాపింగ్ పనులు, రూ.20 కోట్లతో అండర్‌పాస్ పనులు రూ. 75 కోట్ల ఖర్చుతో డ్రైనేజీ ఆధునికీకరణపనులు, రూ.20 కోట్లతో దేవాలయ నిర్మాణం, రూ.25 కోట్ల బహుళ అంతస్తుల కాంప్లెక్స్ నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టబోతున్నామన్నారు.

రెండో జాబితాకు కాంగ్రెస్ తుదిమెరుగులు









రణదీప్ సింగ్ సుర్జేవాలా

● 21 స్థానాల్లో అభ్యర్థుల కోసం భారీ కసరత్తు ● సీఎం, డీసీఎంతో సుర్జేవాలా చర్చలు ● మూడింట మినహా అన్ని చోట్లా ఒక్కో పేరుతో ప్రతిపాదన

బెంగళూరు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల నోటిఫికేషన్ మరికొన్ని గంటల్లోనే వెలువడుతున్న తరుణంలో రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ రెండోజాబితా విడుదలకు తుదిమెరుగులు దిద్దుతోంది. ముఖ్యమంత్రి సిద్దరామయ్య, ఉపముఖ్యమంత్రి, కేపీసీసీ అధ్యక్షుడు డీకే శివకుమార్‌తో సుదీర్ఘంగా చర్చలు జరిపిన పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ రణదీప్‌సింగ్ సుర్జేవాలా అభ్యర్థుల జాబితాను ఒక కొలిక్కితెచ్చినట్టు తెలుస్తోంది. రెండు రోజులపాటు సాగిన కసరత్తుకు సంబంధించి పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అభిప్రాయాలకు ప్రాధాన్యత ఇచ్చినట్టు తెలుస్తోంది. శుక్రవారం జాబితా పార్టీ కేంద్ర ఎన్నికల కమిటీకి చేరింది. రెండు రోజులుగా ఖర్గే రాష్ట్ర పర్యటనలో ఉన్నందున జాబితాకు ఆమోదం సాధ్యం కాలేదు. పార్టీ తొలి జాబితాలో ఏడుగురు అభ్యర్థులను ఖరారు చేశారు. మిగిలిన 21 స్థానాల కోసం అభ్యర్థులపై కసరత్తు చేస్తున్నారు. కేంద్ర ఎన్నికల కమిటీకి సిఫారసు చేసిన జాబితాలో ఇవే పేర్లు ఉంటాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే కొందరికి నియోజకవర్గంలో ప్రచారానికి వెళ్లాలని సూచించినట్లు తెలుస్తోంది. రాష్ట్రంలోనే కీలకమైన బెంగళూరు దక్షిణ నియోజకవర్గానికి మంత్రి రామలింగారెడ్డి కుమార్తె, మాజీ ఎమ్మెల్యే సౌమ్యరెడ్డి పేరు ఖరారైనట్టు తెలుస్తోంది. తొలుత టిక్కెట్ వద్దంటూ రామలింగారెడ్డి అభ్యంతరం వ్యక్తం చేసినా రాష్ట్ర, పార్టీ జాతీయ నేతలు ఒప్పించినట్టు తెలుస్తోంది. బెంగళూరు ఉత్తర స్థానం కోసం రాష్ట్ర పార్టీ ప్రముఖులు చేసిన ప్రయత్నాలు బెడిసికొట్టినట్టు తెలుస్తోంది. బీజేపీ సిట్టింగ్ ఎంపీలు ముగ్గురు వస్తారని, వారిలో ఒకరికి ఉత్తర టిక్కెట్ ఇవ్వాలనే ప్రయత్నాలు సాగాయి. టిక్కెట్ దక్కని సదానందగౌడ జీవితకాలం బీజేపీలోనే ఉంటానని ప్రకటించడంతో అనూహ్యంగా ప్లానింగ్ కమిషన్ ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ రాజీవ్‌గౌడ పేరు తెరపైకి వచ్చింది. ఇదే స్థానానికి గోవిందరాజనగర్ ఎమ్మెల్యే ప్రియాకృష్ణను అభ్యర్థి చేయాలని ప్రయత్నించారు. కానీ ఆయన తండ్రి విజయనగర ఎమ్మెల్యే కృష్ణప్ప తమ కుటుంబానికి టిక్కెట్ వద్దంటూ తేల్చిచెప్పారు. ఇక బెంగళూరు సెంట్రల్ నియోజకవర్గానికి శాంతినగర్ ఎమ్మెల్యే ఎన్ఏ హ్యారిస్ పేరు ప్రస్తావనకు వచ్చినా చివరకు మన్సూర్ అలిఖాన్‌ను సిఫారసు చేసినట్టు తెలుస్తోంది. కోలారు రిజర్వు నియోజకవర్గం నుంచి మంత్రి మునియప్ప లేదా డాక్టర్ ఎల్. హనుమంతయ్యలో ఒకరికి ఇవ్వనున్నట్లు సమాచారం. చామరాజనగర రిజర్వు నియోజకవర్గం నుంచి మంత్రి మహదేవప్ప కుమారుడు సునిల్‌బోస్‌కు సిఫారసు చేసినట్టు తెలుస్తోంది. మైసూరు నుంచి బీజేపీ అభ్యర్థిగా యువరాజు యదువీర్ కావడంతో స్థానికుడైన కాంగ్రెస్ అధికార ప్రతినిధి ఎం. లక్ష్మణ్ పేరు సిఫారసు చేసినట్టు సమాచారం. ఉడుపి-చిక్కమగళూరు స్థానానికి ఇటీవలే పార్టీలో చేరిన జయప్రకాశ్‌హెగ్డేను, దక్షిణకన్నడకు పద్మరాజ్ పేరు ప్రతిపాదించినట్లు తెలిసింది. బెళగావి జిల్లాలోని రెండు నియోజకవర్గాల్లో మంత్రులు సతీశ్‌జార్కిహొళి, లక్ష్మీ హెబ్బాళ్కర్ మధ్య టిక్కెట్ల విషయంలోనూ గందరగోళం నెలకొనగా చివరకు చెరో అభ్యర్థిగా పంచినట్టు తెలుస్తోంది. చిక్కోడి నుంచి మంత్రి సతీశ్‌జార్కిహొళి కుమార్తె ప్రియాంక జార్కిహొళి, బెళగావి నుంచి మంత్రి లక్ష్మీహెబ్బాళ్కర్ కుమారుడు మృణాళ్ హెబ్బాళ్కర్‌కు ఇవ్వనున్నట్లు సమాచారం. బాగల్కోటె నుంచి మంత్రి శివానంద పాటిల్ కుమార్తె సంయుక్త పాటిల్ పేరు సిఫారసు చేశారు. దావణగెరె బీజేపీ అభ్యర్థిగా ఎంపీ సిద్దేశ్వర్ భార్యకు కేటాయించడంతో పోటీగా కాంగ్రెస్ మంత్రి ఎస్ఎస్ మల్లికార్జున భార్య లతా మల్లికార్జున పేరు సిఫారసు చేశారు. బీదర్ నుంచి రాజశేఖర్ పాటిల్ లేదా మంత్రి ఈశ్వర్‌ఖండ్రె వారసుడు సాగర్ ఖండ్రెలలో ఒకరికి టిక్కెట్ దక్కనుంది. చిత్రదుర్గ నుంచి మరోసారి చంద్రప్ప, ఉత్తరకన్నడ నుంచి అంజలి నింబాల్కర్, రాయచూరు నుంచి కుమార్‌నాయక్ పేర్లను సిఫారసు చేశారు. చిక్కబళ్లాపుర నుంచి కేంద్ర మాజీ మంత్రి, మాజీ సీఎం వీరప్పమొయిలీ ప్రయత్నాలు దాదాపు బెడిసికొట్టినట్టు తెలుస్తోంది. యూత్ కాంగ్రెస్ జాతీయ కమిటీలో కీలకంగా ఉన్న రక్షారామయ్య పేరు సిఫారసు చేసినట్టు సమాచారం.

మైసూరు అభివృద్ధిపై బీజేపీ నిర్లక్ష్యం

● ముఖ్యమంత్రి సిద్దరామయ్య

బెంగళూరు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): మైసూరు జిల్లాను అభివృద్ధి చేయడంలో బీజేపీ నిర్లక్ష్యం వహించిందని ముఖ్యమంత్రి సిద్దరామయ్య మండిపడ్డారు. మైసూరులో శుక్రవారం గ్యారెంటీ పథకాల లబ్ధిదారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం కొనసాగిన కాలంలో మైసూరులో ఏ విధమైన అభివృద్ధి చేశారని ప్రశ్నించారు. నిత్యావసరాల ధరల పెంపుతో సామాన్యులు ఇబ్బంది పడుతుంటే ఐదు గ్యారెంటీల ద్వారా ప్రతి కుటుంబానికి ఆర్థిక సహకారం అందించామని పేర్కొన్నారు. బీజేపీ నేతల తరహాలో తాము అబద్ధాలు చెప్పలేదన్నారు. దేశంలో ప్రతి బ్యాంకు ఖాతా కల్గిన పేదవాడికి రూ.15లక్షలు జమ చేస్తానని హామీ ఇచ్చిన ప్రధాని నరేంద్రమోదీ కనీసం 15 పైసలు కూడా వేయలేదని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో ఎన్నికల ప్రణాళికలో గ్యారెంటీల హామీ ఇచ్చామని, అవి అమలు చేస్తున్నామని తెలిపారు. తమ ప్రభుత్వం అమలు చేస్తున్న గ్యారెంటీలు బీజేపీ అభిమానులకు కూడా అందాయని చెప్పారు. రాష్ట్రంలో గ్యారెంటీలు అమలు కావని ప్రధాని నరేంద్రమోదీతోపాటు రాష్ట్ర నాయకులు బసవరాజ్ బొమ్మై, అశోక్, విజయేంద్ర విమర్శించారని, ఇప్పుడు వీటికి సమాధానం చెప్పాలన్నారు. గ్యారెంటీలు సాధ్యం కావని చెప్పినవారే మోదీ గ్యారెంటీ పేరిట అమలు చేసేందుకు సిద్ధమవుతున్నారని విమర్శించారు. మైసూరు జిల్లా అభివృద్ధి కోసం బీజేపీ ఒక పథకం కూడా అమలు చేయలేదన్నారు. ఆసుపత్రులు, కళాశాలలు, మార్కెట్, రహదారులు, శాశ్వత నీరు తమ పాలనలోనే అమలులోకి తెచ్చామన్నారు. కార్యక్రమంలో మంత్రులు మహదేవప్ప, వెంకటేశ్, ఎమ్మెల్యే తన్వీర్‌సేట్, గ్యారెంటీ పథకాల సమితి ఉపాధ్యక్షురాలు పుష్పా అమరనాథ్, ఆశ్రయ సమితి ఉపాధ్యక్షుడు డాక్టర్ యతీంద్ర, ఎమ్మెల్యే హరీశ్‌కుమార్ పాల్గొన్నారు.



మైసూరులో లబ్ధిదారుల సమావేశంలో సీఎం సిద్ధరామయ్య తదితరులు

ఎన్ఐఏ అదుపులో కెఫె పేలుళ్ల నిందితుడు

బెంగళూరు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): రామేశ్వరం కెఫెలో బాంబు పేలుళ్లకు సంబంధించి జైలులో గడుపుతున్న మాజ్ మునీర్‌ను బాడీ వారెంట్‌తో ఎన్ఐఏ అధికారులు శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. శివమొగ్గ ట్రయల్ బ్లాస్ట్ కేసులో మునీర్ అరెస్టు కాగా పరప్పన అగ్రహార జైలులో గడుపుతున్నాడు. అతడిని విచారణ కోసం ఏడు రోజులపాటు ఎన్ఐఏ అదుపులోకి తీసుకుంది. శివమొగ్గ జిల్లా తీర్థహళ్లి నివాసి మాజ్ మునీర్. 2020 జనవరిలో ఎన్ఐఏ దాడి చేసిన వేళ ఏడుగురు అరెస్టు అయ్యారు. అప్పట్లోనే భారీ కుట్రను ఎన్ఐఏ అధికారులు తెలుసుకోగలిగారు. అప్పట్లో తప్పించుకున్నవారే రామేశ్వరం కెఫెలో బాంబు పేలుడుకు పథకం పన్నినట్టు ఆధారాలు లభించాయి. హిందు ప్రముఖులను టార్గెట్ చేసుకుని ఒక సంఘం పేలుడుకు కుట్ర పన్నింది. ఇప్పటికీ అదే సంఘం ప్రమేయం ఉన్నట్టు ఆనవాళ్లను ఎన్ఐఏ గుర్తించినట్టు తెలుస్తోంది. అప్పట్లో పరారీ అయిన అబ్దుల్ మతీన్, ముజాఫిర్ హుసేన్, సయ్యద్ అలిల ఆచూకీ ఇప్పటివరకు లభించలేదు. దీంతో వారిపై అనుమానంతోనే ఎన్ఐఏ వేట ప్రారంభించింది. రెండురోజులక్రితం బళ్లారికి చెందిన షబ్బీర్‌ను అదుపులోకి తీసుకున్నారు. బాంబు పేలుడు సూత్రధారితో ఫోన్‌లో సంభాషించిన మేరకే అతడిని అదుపులోకి తీసుకున్నట్టు తెలుస్తోంది.

ఆస్తిపన్ను రాయితీ జూలై వరకు పొడిగింపు

బెంగళూరు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): బృహత్ బెంగళూరు మహానగర పాలికె (బీబీఎంపీ)లో 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆస్తిపన్నులను పూర్తిగా చెల్లిస్తే 5 శాతం రాయితీ ఇచ్చే పథకాన్ని జూలై 31 వరకు పొడిగించారు. అంతకుముందు ప్రకటించిన ప్రకారం ఈ పథకం ఏప్రిల్ 30తో ముగియాల్సి ఉంది. లోక్‌సభ ఎన్నికల విధుల నేపథ్యంలో బీబీఎంపీ రెవెన్యూ అధికారులకు అదనపు బాధ్యతలు ఉంటాయని, వసూళ్ల లక్ష్యాలను అందుకోవడం కష్టమని విజ్ఞప్తులు రావడంతో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు బీబీఎంపీ చీఫ్ కమిషనర్ తుషార్ గిరినాథ్ నగరంలో శుక్రవారం మీడియాకు చెప్పారు. ప్రస్తుత ఆస్తి పన్నుల విధానాన్నే కొనసాగిస్తామని, ఇందులో ఎలాంటి మార్పులు, చేర్పులు ఉండవని ఆయన స్పష్టం చేశారు. 804 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంతో 8 జోన్లతో కోటికి పైగా జనసంఖ్య ఉన్న బృహత్ బెంగళూరు మహానగరపాలికెలో 16 లక్షలకు పైగా వసతి గృహాలు, 6 లక్షలకు పైగా వాణిజ్య కట్టడాలు ఉన్నాయని వీటి నుంచి శాస్త్రీయ పద్ధతుల్లో పన్నులు రాబడితే ఏడాదికి రూ. 8వేల కోట్ల ఆదాయం లభిస్తుందని బీజేపీ అభిప్రాయపడింది. పార్టీ నేత ఎన్ ఆర్ రమేష్‌నగరంలో శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ ఆస్తిపన్నులను 6.5 శాతం పెంచాలన్న ప్రతిపాదనను తక్షణం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

మహిళల రక్షణకు శక్తి సదన

● జిల్లాకో పునరావాస కేంద్రం



బెంగళూరు, మార్చి 15(ఆంధ్రజ్యోతి): దౌర్జన్యాల బారినపడిన, వివిధ కారణాలతో ఇల్లు వదిలిన, హ్యూమన్ ట్రాఫికింగ్, లైంగిక దౌర్జన్యాలకు గురైన బాధితులను సంరక్షించే దిశగా రాష్ట్రప్రభుత్వం ప్రతి జిల్లాకు ఒక శక్తి సదన (సమగ్ర పరిహారం, సౌలభ్యాలు, పునరావాసం) కేంద్రాలు ప్రారంభించేందుకు సిద్ధమైంది. సంక్లిష్ట పరిస్థితి ఎదుర్కొంటున్న వారికి సాయం చేయడంతోపాటు ఆశ్రయాన్ని కల్పించేలా ఇప్పటికే 55 సాంత్వన కేంద్రాలు, హ్యూమన్ ట్రాఫికింగ్, లైంగిక దౌర్జన్యాల బారిన పడినవారిని రక్షించేందుకు 14 ఉజ్వల కేంద్రాలు పనిచేస్తున్నాయి. ఇవి స్వచ్ఛంద సంస్థల సాయంతో కొనసాగుతున్నాయి. వీటిని పూర్తిగా విలీనం చేసి శక్తిసదన పేరిట ప్రతిజిల్లాకొక కేంద్రాన్ని తెరవనున్నారు. కేంద్రప్రభుత్వ 'మిషన్ శక్తి' పథకంలో భాగంగా వారి మార్గదర్శకాలకు అనుగుణంగా కేంద్రాలను ఏర్పాటు చేస్తారు. రాష్ట్రంలోని ప్రతి జిల్లాకు 50 మంది బాధితులకు ఈ కేంద్రం అండగా ఉంటుంది. బెంగళూరులో 3, బెళగావిలో అదనంగా ఒక కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నారు. మొత్తంగా 35 కేంద్రాలను త్వరలోనే అందుబాటులోకి తీసుకురానున్నారు. అత్యవసరంగా కేంద్రాల ప్రారంభానికి అద్దెభవనాలు సమకూర్చాలని, ప్రతి సెంటర్‌కు 9మంది సిబ్బందిని నియమించుకునేలా జిల్లా అధికారికి అధికారం అప్పగించారు. ప్రస్తుతం స్వచ్ఛంద సంస్థల ద్వారా కొనసాగుతున్న సాంత్వన, ఉజ్వల కేంద్రాలను ఈనెల 31న పూర్తిగా రద్దు చేయాలని సూచించారు. దీన్నిబట్టి ఏప్రిల్ ప్రారంభం నుంచి శక్తిసదన కేంద్రాలు జిల్లా అధికారుల పర్యవేక్షణలో కొనసాగనున్నాయి. లైంగిక దౌర్జన్యానికి గురైన వారికి, వివిధ కారణాలతో కుటుంబికులు వదిలి వెళ్లి సంక్లిష్ట పరిస్థితుల్లో ఉన్న మహిళలకు ఆహారం, వసతి, వైద్య సేవలు, న్యాయ పోరాటానికి అవసరమైన నైపుణ్యత కల్పించడం శక్తిసదన లక్ష్యంగా ఉన్నాయి. ప్రస్తుతం అందుబాటులో ఉండే స్వచ్ఛంద సంస్థల కేంద్రాల్లో ఓ మహిళకు భోజనం కోసం రూ.1300, మందులకు రూ.175, రిక్రియేషన్‌కు రూ.1000, పాకెట్‌మనీగా రూ.100తో కలిపి నెలకు రూ.2.500 ఖర్చు చేస్తున్నారు. ఇకపై శక్తిసదన కేంద్రాలలో ప్రభుత్వమే అన్ని ఖర్చులు భరించేలా ప్రతి కేంద్రానికి గరిష్ఠంగా 50మందిని మాత్రమే ఎంపిక చేస్తారు. దౌర్జన్యాల బారినపడి లేదా ఇతరత్రా సమస్యలతో కొంతకాలంపాటు కేంద్రాలలో గడిపేలాంటివారు 35 మంది, హ్యూమన్ ట్రాఫికింగ్, వేశ్యావాటిక తదితర సమస్యలు ఎదుర్కొనే 15 మందికి చేర్చుకోనున్నారు. ఈ కేంద్రాల్లో సౌలభ్యాలు తదితర అన్ని మార్గదర్శకాలను ప్రభుత్వమే రూపొందించింది.

నేడు కలబురగికి మోదీ

● ప్రధాని ప్రసంగంపైనే సర్వత్రా ఆసక్తి ● రాజధాని నీటి ఎద్దడి ప్రస్తావించే అవకాశం



బెంగళూరు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్రమోదీ శనివారం రాష్ట్రంలోని కలబురగి నగరానికి రానున్నారు. లోక్‌సభ ఎన్నికల వేళ ప్రధాని రాష్ట్ర పర్యటన రాజకీయ ప్రాధాన్యతను సంతరించుకుంది. కలబురగిలోని ఎన్‌వీ క్రీడామైదానంలో జరిగే ప్రధాని సభకు కనీసం మూడు లక్షల మంది ప్రజలు హాజరు కాగలరని అంచనా వేస్తున్నారు. ప్రధాని రాకను పురస్కరించుకుని కలబురగి నగరం అంతటా భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. బీజేపీ రాష్ట్ర ఎన్నికల నిర్వహణా కమిటీ మల్లేశ్వరంలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం ప్రత్యేకంగా సమావేశమైంది. ఇందులో లోక్‌సభ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై కసరత్తు చేసింది. అనంతరం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బీవై విజయేంద్ర మీడియాతో మాట్లాడుతూ ప్రధాని కలబురగి సభ ద్వారా ఎన్నికల ప్రచార శంఖారావానికి శ్రీకారం చుడతారన్నారు. లోక్‌సభ ఎన్నికల తొలి జాబితాలో అత్యంత సమర్థులైనవారికి టిక్కెట్లు ఇచ్చామన్నారు. అక్కడక్కడ కొద్దిగా అసంతృప్తి ఉన్న మాట నిజమేనని, త్వరలోనే అంతా సర్దుకుంటుందన్నారు. ప్రధాని సమక్షంలోనే మైసూరు యువరాజు యదువీర్, హృద్రోగ నిపుణుడు డాక్టర్ సీఎన్ మంజునాథ్ బీజేపీలో చేరతారనే అంశంపై పార్టీ వర్గాల నుంచి ఎలాంటి స్పష్టత లేదు. హావేరి పర్యటనలో ఉన్న మాజీ ముఖ్యమంత్రి బసవరాజ్ బొమ్మై శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర ఖజానా ఖాళీ అయ్యిందని, కేవలం ప్రకటనల్లో మాత్రమే నిధులు కనిపిస్తున్నాయని ఎద్దేవా చేశారు. ప్రజలకు కనీసం తాగునీటిని సైతం అందించలేని దరిద్రపుగొట్టు ప్రభుత్వం అధికారం చలాయిస్తోందని మండిపడ్డారు. కేంద్రం ఇస్తున్న 5 కిలోల బియ్యాన్ని అన్నభాగ్య పథకం కింద తమదిగా ప్రచారం చేసుకుంటోందని ధ్వజమెత్తారు.

ప్రధాని ప్రసంగంపై సర్వత్రా కుతూహలం

కాంగ్రెస్ సంధించిన ఎలక్టోరల్ బాండ్ల ఆరోపణలపై, రాష్ట్రానికి గ్రాంట్లు, జీఎస్టీ వాటా మంజూరులో అన్యాయం వంటి అంశాలపై ప్రధాని ఏ విధంగా స్పందిస్తారో ఎదురు చూస్తున్నామని కాంగ్రెస్ నేత ఒకరు శుక్రవారం పేర్కొన్నారు. దక్షిణాదిన బీజేపీ అత్యధిక స్థానాలు గెలిచే అవకాశం ఉన్న కర్ణాటకలో ప్రధాని ప్రసంగంపై సహజంగానే సర్వత్రా కుతూహలం నెలకొని ఉంది. ప్రధాని తన ప్రసంగంలో కొత్త విషయాలను సైతం ప్రస్తావించే అవకాశం ఉందని పార్టీ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

ఎన్నికల్లో రామమందిర ప్రచారం తప్పేమీకాదు

లోక్‌సభ ఎన్నికల్లో రామమందిర నిర్మాణాన్ని బీజేపీ ప్రస్తావిస్తే అందులో ఎలాంటి తప్పులేదని ఉడుపి పెజావర పీఠాధిపతి విశ్వప్రసన్నతీర్థ స్వామిజీ పేర్కొన్నారు. దావణగెరెలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రామమందిర నిర్మాణ అంశాన్ని బీజేపీ తన ఎన్నికల ప్రణాళికల్లో దశాబ్దాల కాలంగా ప్రస్తావిస్తూ వచ్చిందని, ఇప్పుడు ఈ కలను సాకారం చేసిన ఆ పార్టీ ప్రస్తావిస్తే తప్పేమిటని ప్రశ్నించారు. అయోధ్య రామమందిర నిర్మాణం తరహాలోనే కర్ణాటకలో ఆంజనేయస్వామి జన్మస్థలం అభివృద్ధికోసం ఓ ప్రత్యేక ట్రస్టు ఏర్పాటు చేయాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.



కలబురగిలో మోదీ పాల్గొననున్న సభకు ఏర్పాట్లు



గూళ్యంలో అశేష జనం మధ్య ఊరేగుతున్న గాదిలింగప్ప, సిద్దేశ్వర స్వామి జోడు రథాలు



ప్రత్యేకాలంకరణలో గూళ్యం గాదిలింగప్ప స్వామి

వైభవంగా జోడు రథోత్సవం

కంప్లి, మార్చి 15 : కర్ణాటక, ఆంధ్ర రాష్ట్రాల మధ్య వేదావతి నది ఒడ్డున వుండే గూళ్యం గాదెలింగప్ప, సిద్దేశ్వరస్వామి రథోత్సవం శుక్రవారం కన్నుల పండువగా నిర్వహించారు. ఇటు బళ్లారి, అటు కర్నూలు జిల్లాల ప్రజలు ఎద్దులబండ్లు, వాహనాలపై గూళ్యానికి చేరుకుని మొక్కులను సమర్పించుకున్నారు. ప్రతి యేటా ఈ రథోత్సవం రెండు రాష్ట్రాల భక్తులు కన్నుల పండువగా నిర్వహించుకుంటారు. రెండు రాష్ట్రాల పోలీసు శాఖ సిబ్బంది భారీ బందోబస్తు నిర్వహించారు. ఈ రథోత్సవానికి ప్రజా ప్రతినిధులు, ప్రముఖ నాయకులు పాల్గొని గాదిలింగప్ప, సిద్దేశ్వరస్వామి వారిని దర్శించుకున్నారు. జోడు రథాలను ఆలయం వద్ద నుంచి ఎదురు బసవన్న కట్ట వరకు తిరిగి ఆలయం వరకు రథాలను లాగారు.


బీజేపీ నేత సునిల్‌కు కీలక బాధ్యతలు

● లోక్‌సభ ఎన్నికల నిర్వహణ కమిటీ రాష్ట్ర కన్వీనర్‌గా నియామకం



వి. సునిల్ కుమార్

బెంగళూరు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): బీజేపీ సీనియర్ నేత, ఎమ్మెల్యే వి. సునిల్ కుమార్‌కు పార్టీ అధిష్టానం కీలక బాధ్యతలను అప్పగించింది. బీజేపీ లోక్‌సభ ఎన్నికల నిర్వహణా కమిటీ రాష్ట్ర కన్వీనర్‌గా సునిల్‌కుమార్‌ను నియమిస్తూ పార్టీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు బీవై విజయేంద్ర నగరంలో ఆదేశాలు జారీ చేశారు. పార్టీ తనకు అప్పగించిన కీలక బాధ్యతలను చిత్తశుద్ధితో నిర్వర్తిస్తానని, బీజేపీ-జేడీఎస్ కూటమి మొత్తం 28 నియోజక వర్గాలను క్లీన్‌స్వీప్‌చేసే దిశలో వ్యూహాలను అమలు చేస్తామని సునీల్ కుమార్ నగరంలో శుక్రవారం మీడియాకు చెప్పారు. నరేంద్రమోదీని ముచ్చటగా మూడోసారి ప్రధానిగా చూడాలని రాష్ట్ర ప్రజలు ఇప్పటికే తీర్మానించుకున్నారని ఆయన చెప్పారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1,583.32	1,597.66
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	000	00
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	2,199	8,443
సామర్థ్యం (టీఎంసీలు)	6.28	18.65

బళ్లారిలో 'గాలి' ఎటు వీస్తుందో?

- కేఆర్‌పీపీ రాజకీయ గమ్యంపై చర్చలు
- అమిత్‌షాను కలిసిన జనార్దన్ రెడ్డి

బళ్లారి, మార్చి 15(ఆంధ్రజ్యోతి): కల్యాణ ప్రగతి పక్ష పార్టీ (కేఆర్‌పీపీ) అధ్యక్షుడు గాలి జనార్దన్ రెడ్డి గురువారం రాత్రి బీజేపీ నాయకుడు, కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాతో భేటీ కావడం చర్చనీయాంశంగా మారింది. ఎంపీ ఎన్నికలకు నోటిఫికేషన్ వెలువడుతున్న సమయంలో ఈ ఇద్దరి కలయిక వెనుక అనేక రాజకీయ కారణాలు ఉన్నట్లు చెబుతున్నారు. బీజేపీ నుంచి గాలి జనార్ద న్‌రెడ్డి బయటకు వచ్చి అసెంబ్లీ ఎన్నికల ముందు కొత్తగా పార్టీని స్థాపించారు. తనను బీజేపీ అధిష్టానం పట్టించుకోవడం లేదని తాను బళ్లారికి రావడానికి అనుమతులు ఇవ్వకుండా బీజేపీ పెద్దలే అడ్డు తగులుతున్నారని అప్పట్లో గాలి జనార్దన్‌రెడ్డి బహిరంగంగానే విమర్శించారు. ఇక్కడ ఉండే తన స్నేహితులు కూడా తనకు ఇబ్బంది కలిగిస్తున్నారని ఆయన అనేక సమావేశాల్లో బహిరం గంగానే విమర్శించారు. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం గాలి జనార్దన్ రెడ్డి అమిత్ షా తో గురువారం రాత్రి సుమారు గంట పాటు చర్చలు సాగిం చారు. కేఆర్‌పీపీ పార్టీని బీజేపీలో కలిపేయాలని అమిత్ షా సూచించారని తెలుస్తోంది. ఇందుకు గాలి జనార్దన్‌రెడ్డి కూడా కొంత అయిష్టత వ్యక్తం చేశారని సమాచారం. ఎంపీ అభ్యర్థుల ప్రకటన తరువాత తనను కలిసేందుకు అవకాశం ఇవ్వడం, అంతే కాకుండా కొప్పళ, రాయచూరు, బళ్లారి జిల్లాల్లో ఇప్పటికే అభ్య ర్థుల ప్రకటన జరిగిన నేపథ్యంలో ఏ నిర్ణయం తీసుకోవాలో తనకు అర్థం కాక జనార్దన్‌రెడ్డి ఏ విషయం ఖచ్చితంగా తెలపలేక పోయారని సమాచారం. వాస్త వానికి రాయచూరు ఎస్టీ రిజర్వుడు నియోజకవర్గంలో తనకు అనుకూలంగా ఉండే వ్యక్తులను రంగంలోకి దింపాలని జనార్దన్‌రెడ్డి భావించారు. కొప్పళ జన రల్ ఎంపీ స్థానం నుంచి తన భార్య లక్ష్మిఅరుణ పోటీ చేయడానికి బీజేపీ సాను కూలత వ్యక్తం చేస్తుందని భావించారు. కానీ ఇప్పటికే ఎంపీ అభ్యర్థులను ప్రక టించడంతో ఇప్పుడు ఏమిచేయాలో తెలియక గాలి కొంత మౌనంగానే ఉండిపో యారని సమాచారం. అయితే ఆయన కేఆర్‌పీపీ నుంచి పోటీకి అభ్యర్థులను నిలుపుతారా..?లేదా బీజేపీ అభ్యర్థులకు మద్దతు ఇస్తారా..?లేక కాంగ్రెస్‌తో చేతులు కలుపుతారా..?అనే విషయంలో ఇంకా స్పష్టత వ్యక్తం చేయలేదు. కాక పోతే ఆయన వర్గీయుల్లో కొందరు బీజేపీలో చేరదామంటుంటే, మరి కొందరు కాంగ్రెస్ బెస్టు కదా అని అంటున్నారు. మరి కొందరు రెండూ వద్దని, ఇలాగే ప్రత్యేకంగా మనపార్టీలోనే ఉంటూ పోటీ చేస్తే సరిపోతుందని సలహాలు ఇస్తు న్నారు. చివరకు 'గాలి' ఎటు వీస్తుందో వేచిచూడాల్సిందే.



అమిత్ షాకు పుష్పగుచ్ఛం ఇస్తున్న గాలి జనార్దన్‌రెడ్డి

కాంగ్రెస్ మల్లగుల్లాలు

- బళ్లారి టిక్కెట్ రేసులో చైతన్యతుకారాం, వెంకటేశ్ ప్రసాద్
- మాజీ ఎంపీ ఉగ్రప్పకు అవకాశాలు తక్కువే..



చైతన్య తుకారాం



వెంకటేశ్ ప్రసాద్

బళ్లారి, మార్చి15(ఆంధ్రజ్యోతి): బళ్లా రిలో లోక్‌సభ ఎన్నికల వేడి మొదలైంది. బళ్లారి లోక్‌సభ అభ్యర్థిగా బీజేపీ మాజీ మంత్రి, శ్రీరాములు పేరును ఇప్పటికేప్రక టించింది. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల ఎంపి కలో మల్లగుల్లాలు పడుతోంది. సండూరు ఎమ్మెల్యే తుకారాం కూతురు చైతన్య తుకారాం అలియాస్ సౌపర్ణిక పేరు మొదటి వరుసలో ఉందని పార్టీ వర్గాలు పేర్కొంటు న్నాయి. మంత్రి నాగేంద్ర సోదరుడు వెంకటేశ్ ప్రసాద్ పేరు కూడా ప్రస్తావనలో ఉంది. ఒక దశలో పార్టీలో ఉండే సండూరు ఎమ్మెల్యే తుకారాం లేదా మంత్రి నాగేంద్ర ఇద్దరిలో ఒకరిని లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయించాలని పార్టీ పెద్దలు అంచనాలు వేశారు. కానీ ఆ రిస్కు ఎందుకు అని మంత్రి నాగేంద్ర, తుకారాం భావించి పోటీకి తిరస్కరించినట్టుగా పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. బీజేపీలో బలంగా ఉన్న మాజీ మంత్రి శ్రీరాములు లాంటి రాజకీయ కురువృద్ధులను మరో సారి ఓడించాలంటే గట్టివాళ్లనే నిలపాలని కాంగ్రెస్ భావిస్తోంది. ఇందులో బాగంగా సండూరు ఎమ్మెల్యే తుకారాం కూతురు చైతన్య తుకారాంను రంగంలోకి దింపాలని పార్టీ భావిస్తోంది. ఈనేపథ్యంలో తుకారాం కూతురుపేరును సంతోష్‌లాడ్ అధి ష్టానం వద్ద ప్రతిపాదించారు. ఇక మంత్రి నాగేంద్ర సోదరుడు వెంకటేశ్ ప్రసాద్ కూడా ముందు నుండి టికెట్‌ను ఆశిస్తున్నారు. ఆయన పేరు కూడా పరిశీలనలో ఉంది. ఇక మాజీ ఎంపీ ఉగ్రప్ప పేరు తొలుత పరిశీలనకు వచ్చినా ప్రస్తుతం ఆయన ఎంపీ అభ్యర్థిత్వాన్ని బలపరిచే వారు తగ్గిపోయారు. కొందరు ఎమ్మెల్యేలు ఉగ్రప్పకు నాన్ లోకల్ అనే ముద్ర ఉందని పార్టీ అధిష్టానంతో చెప్పినట్లు సమా చారం. ఈ ముగ్గురిలో తొలి వరసలో తుకారాం కూతురు చైతన్య అలియాస్ సౌప ర్ణిక పేరు ముందు వరుసలో ఉంది. మొత్తంమీద కాంగ్రెస్ తన అభ్యర్థిని త్వరలోనే ప్రకటించే అవకాశాలు కన్పిస్తున్నాయి.

నామఫలకాలపై కన్నడ తప్పనిసరి

కలెక్టర్ ప్రశాంత్‌కుమార్



బళ్లారి సిటీ, మార్చి 15: నగర, గ్రామీణ ప్రాంతాల్లోని అన్ని ప్రభుత్వ శాఖలు నామఫ లకాలపై వారంలోపు కన్నడ భాషను 60 శాతం ఉండేలా చూసుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా తెలిపారు. స్థానిక అధికారుల అనుమతితో నిర్వహించే సంస్థల నేమ్‌ప్లేట్‌లను కూడా కన్నడలోనే రాయాలన్నారు. కన్నడ భాష సమగ్ర అభివృద్ధి చట్టం 2022 సవరణ చట్టం 2024 ప్రకారం, వాణిజ్య పారిశ్రామిక, వ్యాపారసంస్థలు, ట్రస్టులు ,కౌన్సెలింగ్ కేంద్రాలు, ఆసుపత్రులు, లేబోరేటరీలు, వినోద కేంద్రాలు, హోటళ్లు, బ్యాంకులు ప్రభుత్వం లేదా స్థానిక అధికారుల అనుమతిలో నిర్వహించబడుతున్న వాటి నామఫలకాలపై తప్పనిసరిగా 60శాతం కన్నడ ఉండాలన్నారు. బ్రోచర్‌లు, బ్యానర్‌లు, రేకులు, ఎలక్ట్రానిక్ డిస్‌ప్లే బోర్డులు, ఎయిడెడ్, నాన్ ఎయిడెడ్ సంస్థలు నిర్వహించే పాఠశాల కార్యక్రమా లలో ఉపయోగించే సూచనలు కన్నడ భాషలో తప్పనిస రిగా ఉండాలన్నారు. లేనిపక్షంలో అధికారులు, సంస్థల యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ ప్రశాంత్ కమార్ మిశ్రా హెచ్చరించారు.

తాయమ్మదేవికి ప్రత్యేక పూజలు



సిరుగుప్ప, మార్చి 15: పట్టణంలో వెలసిన తాయమ్మ దేవికి శుక్రవారం సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు ప్రవీణ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. సిరుగుప్ప పట్టణం ఆదోని రోడ్డు మార్గంలో వెలసిన తాయమ్మదేవికి ప్రతి శుక్రవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. పుష్పాలంకార సేవలు, ఆకుపూజ, ప్రసాద పంపిణీ కార్యక్ర మాలు చేపట్టారు. అర్చకులు ధూపదీపనైవేద్యాలతో ప్రత్యేక పూజలు జరిపారు.

ఘనంగా బసప్పతాత ఆరాధనోత్సవాలు



తాత దర్శనం చేసుకుంటున్న ఎమ్మెల్యే నాగరాజు

సిరుగుప్ప, మార్చి 15 : ఘనంగా బసప్ప తాత 58వ ఆరాధనా మహోత్సవాలు శుక్రవారం జరిగాయి. సిరుగుప్ప తాలుకాలోని అరళిగనూరు గ్రామంలో గ్రామ ప్రముఖుల సమక్షంలో ఆరాధన మహోత్సవాలను నిర్వహించారు. ఆరాధన మహోత్సవాల కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే బీఎం నాగరాజు పాల్గొని తాత దర్శనం పొందారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ పవన్‌కుమార్ దేశాయ్, వీరభ ద్రగౌడ, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

క్షయరోగ పరీక్షా మిషన్ ప్రారంభం



రోగులను పరీక్షించే నూతన యంత్రం

కంప్లి, మార్చి 15 : రోగుల కోసం ప్రభుత్వం ఏర్పాటుచేసిన క్షయరోగ పరీక్ష ఎలక్ట్రానిక్ మిష న్‌ను సద్వినియోగం చేసుకోవాలని కంప్లి నియోజకవర్గ ఎమ్మెల్యే గణేష్ పిలుపునిచ్చారు. పట్టణ ఆసుపత్రిలో మంగళ వారం ఆయన నూతనంగా క్షయ రోగ పరీక్ష ఎలక్ట్రానిక్ మిషన్‌ను ప్రారంభించారు. ఈ సంద ర్భంగా మాట్లాడుతూ ఎంతో మంది క్షయరోగం వున్నవారు. పరీక్షలు నిర్వహించుకునేందుకు బళ్లారికి వెళ్లాల్సిన అవ సరం వుండేదనీ, ఇప్పుడు అలాంటి అవసరం లేకుండా కంప్లి ప్రభుత్వాస్పత్రిలోనే ప్రభుత్వం ఈ సౌకర్యం కల్పిం చిందన్నారు. వేసవిని దృష్టిలో వుంచుకుని ప్రతి ఒక్కరు ఆరోగ్యంపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ అరుణ్, రవీంద్ర కనికేరి, శ్రీనివాస్, భరత్, మల్లేశప్ప, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పార్టీలను విడనాడి ముందుకొస్తేనే అభివృద్ధి

- సండూరు ఎమ్మెల్యే తుకారామ్

కంప్లి, మార్చి 15 : పార్టీలను విడనాడి ముందుకొచ్చి నప్పుడే గ్రామాలు అభి వృద్ధి చెందుతాయని సండూరు ఎమ్మెల్యే తుకారామ్ తెలిపారు. కొత్త దరోజీ గ్రామంలో రూ.40 లక్షల వ్యయంతో ఈశ్వరాలయం అభివృద్ధికి శుక్రవారం ఆయన భూమిపూజ చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దరోజీ, తోర ణగల్లు రోడ్డు పనులు ఇంకా ఒక కిలోమీటరు మిగిలివున్నాయని, ఆ మిగిలిన పనులను పూర్తి చేసేందుకు రూ. కోటి నిధులు విడుదల చేసినట్లు తెలిపారు. గ్రామంలోని 2వ వార్డులో అభివృద్ధి పనులకు రూ.25 లక్షలు విడుదల చేశామ న్నారు. మాదాపురం రూ. 50 లక్షలు, పాత మాదాపురంకు రూ. కోటి నిధులు త్వరలో విడుదల చేస్తామన్నారు. అంతేకాకుండా ఇకపై కంప్లి, గంగావతి వైపు వెళుతున్న యాష్ లారీలను తోరణగల్లు, హోస్పేట మీదుగా మళ్లించాలని లేనిప క్షంలో ఫ్యాక్టరీలు బంద్ చేపట్టాలని సూచించారు. మరోసారి ఈ సమస్య రాకుండా చూడాలన్నారు. దీనిపై నిర్లక్ష్యం వహిస్తే తాము చర్యలు తీసుకుంటా మన్నారు. జిల్లా నుంచి ఎంపీ స్థానానికి పోటీ చేసేందుకు తన కూతురు పేరు కూడా ప్రస్తావనకు వచ్చిందని, హైకమాండ్ తమపై నమ్మకం వుంచి ఆమెకు ఎంపీ టికెట్ ఇస్తే గెలుపొందేందుకు శాయశక్తులా కృషి చేస్తామన్నారు. కార్యక్ర మంలో స్వామి, మాజీ జెడ్పీసభ్యులు జనార్దన్, గురుమూర్తి, బ్లాక్ కాంగ్రెస్ అధ్య క్షులు ఏకాంబరం, నూర్, రమేష్, రవి, విశ్వేశ్వరయ్య, నాగరాజు, లింగప్ప, పంపా పతి, యర్రిస్వామి, మాదాపురం మారెప్ప, తిమ్మరాజు, మహబూబ్, నారాయణ, రమేష్, గ్రామ పంచాయతీ సభ్యులు, కార్యకర్తలు, ఆలయ కమిటీ పదాధికారులు పాల్గొన్నారు.



దరోజీ గ్రామంలో ఆలయానికి భూమిపూజ చేపడుతున్న ఎమ్మెల్యే

తెల్లజొన్న కొనుగోలు కేంద్రాల ప్రారంభం: కలెక్టర్

బళ్లారి గాంధీనగర్, మార్చి 15: ఖరీఫ్ సీజన్‌లో రైతులు పండించిన తెల్లజొన్నలను రైతుల నుండి నేరుగా కొనుగోలు చేయలని నిర్ణయించినట్లు బళ్ళారి జిల్లా టాస్క్‌ఫోర్స్ సమితి అధ్యక్షులు ప్రశాంత్ కుమార్ మిశ్రా తెలిపారు. ఎఫ్ఎక్యూ స్థాయి జొన్నను రైతుల నుండి ఖరీదు చేస్తున్నట్లు తెలిపారు. ఇందుకోసం జిల్లాలో ఐదు కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినట్లు ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలో ఒక లక్ష మెట్రిక్ టన్నుల జొన్నను కొనుగోలు చేయాలనే ఉద్దేశంతో ఈ కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినట్లు రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో ప్రతి క్వింటాల్ తెల్లజొన్నకు ధరను రూ 3,225లు నిర్ణయించగా, ప్రతి క్వింటాల్ హైబ్రిడ్ జొన్నకు ధరను రూ 3,180గా నిర్ణయించినట్లు తెలిపారు. ఇందుకు సంబంధించి బళ్ళారి తాలూకా కర్ణాటక రాష్ట్ర ఉగ్రాణ మండలి బళ్ళారి విభాగం 9900677875, కంప్లి 9740838910, సిరుగుప్ప9731421918, 8951307333, 9945940350 నెంబర్లకు ఫోన్ చేసి వివరాలు పొందవచ్చునన్నారు.

సమస్యలు తలెత్తకుండా చూడాలి: ఎమ్మెల్యే



అభివృద్ధి పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే గణేష్

కంప్లి, మార్చి 15 : కంప్లి పట్టణంలో ప్రతి వార్డులో కౌన్సిలర్లు సమస్యలు తలె త్తకుండా చూడాలని ఎమ్మెల్యే గణేష్ అన్నారు. ఏదైనా సమస్య వుంటే తన దృష్టికి తీసుకువస్తే వాటిని పరిష్కరిస్తామని తెలిపారు. కంప్లి పట్టణంలోని 2, 4, 5, 9, 13, 16, 18 వార్డులలో అభివృద్ధి పనులకు ఆయన శుక్రవారం భూమిపూజ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డుల్లో మురుగుకాలువల శుభ్రత, తాగు నీరు, విద్యుత్ లైట్లు ఈ మూడు ప్రధానమైన వాటిపై దృష్టిసారించాలన్నారు. అవ సరమైన నిధులను తాము ఇస్తామన్నారు. త్వరలో ఇది నగరసభ కానుందని, అప్పుడు నెంబర్ 10 ముద్దాపురం, నెల్లూడి కొట్టాల, యల్లమ్మ క్యాంపు, ప్రభు క్యాంపులు కూడా నగరసభలో చేరే అవకాశం వుందన్నారు. రెండు రోజుల్లో ఎన్నికల కోడ్ విడుదలవుతుందని, కార్యకర్తలంతా ఎన్నికలకు సిద్ధం కావాలని సూచించారు. ఇప్పటికే కంప్లిలో వంద పడకల ఆస్పత్రి, మినీ విధానసభ, సోమప్ప చెరువు అభి వృద్ధి పనులు జరిగాయన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు బట్టా ప్రసాద్, చాంద్ బాషా, వీరాంజనేయులు, లడ్డూ వన్నూరువలీ, సత్యప్ప, సుధాకర్, రఘు, విరుపాక్షి, కృష్ణ, మనోహర్, శ్రీనివాస్, శీనప్ప, సుధాకర్, గోపాల్, గౌస్, షెక్షావలీ తదితరులు పాల్గొన్నారు.

బోగతాత ఆశీస్సులు తీసుకున్న శ్రీరాములు

బళ్లారి సిటీ, మార్చి 15: హోస్పేట తాలూకాలోని ఇంగలి గ్రామానికి శుక్రవారం ప్రచార నిమిత్తం వచ్చిన బళ్లారి లోక్‌సభ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి బి.శ్రీరాములు బోగతాతను కలుసు కుని ఆయన ఆశీస్సులు తీసుకున్నారు. ఈసందర్భంగా శ్రీరాములు మాట్లాడుతూ కేఎస్ ఈశ్వరప్ప చాలా స్ట్రిక్ట్, కానీ ఆయన మనస్సు చిన్నపిల్లవాడిలా ఉంటుందన్నారు. టిక్కెట్ విషయంలో మనస్థా పానికి గురయ్యే అవకాశం ఉందన్నారు. యడ్యూరప్ప తమను శాంతింపజేస్తారనే నమ్మకం ఉందన్నారు. బీఎస్ యడ్యూరప్ప, కేఎస్ ఈశ్వరప్ప సన్నిహిత మిత్రులని, చిన్నచిన్న సమస్యలను పరిష్కరించే శక్తి ఇద్దరికీ ఉంటుందన్నారు. ఈశ్వరప్పను శాంతిం పచేయడంలో యడ్యూరప్ప విజయం సాధిస్తారనే నమ్మకం ఉందన్నారు. బళ్లారి లోక్‌సభ నియోజకవర్గంలో ఆనంద్‌సింగ్ ప్రభావం ఇంకా బలంగానే ఉందని, విజయనగరం జిల్లాలో ఆయన నేతృత్వంలోనే ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నామ న్నారు. రాజకీయాలకు దూరంగా ఉంటానని ముందే చెప్పి ఉండ వచ్చునని, కానీ ఆయనను ఒప్పించి తప్పకుండా తమతో తెచ్చు కుంటామని శ్రీరాములు అన్నారు.



బోగతాత ఆశీస్సులు అందుకుంటున్న బీజేపీ బళ్లారి ఎంపీ అభ్యర్థి శ్రీరాములు

నర్సరీ నిర్వహణపై నైపుణ్యాభివృద్ధి శిక్షణ

బళ్లారి సిటీ, మార్చి 15: ఐసీఏఆర్ ఆధ్వర్యంలోని భారతీయ నేల, నీటి సంరక్షణ పరిశోధన కేంద్రం ద్వారా బెలగల్ తాండాలోని ఎస్‌సీఎస్‌పీ రైతులకు నైపుణ్య అభివృద్ధి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. నర్సరీ నిర్వహణ ప్రాధాన్య తను ఐసీఏఆర్ పరిశోధన కేంద్రం అధినేత డాక్టర్ బి.కృష్ణారావు రైతులకు తెలి యజేశారు. సహాయ ఉద్యానవన అధికారి కన్సల్టెంట్ సురేంద్ర కుమార్ రైతులకు ప్రభుత్వ పథకాల కింద అందుతున్న పథకాలు, రాయితీల గురించి తెలియజే శారు. నర్సరీ పద్ధతుల్లో అవలంబించే పనిముట్లు, మెళకువలు, ఉద్యాన పంట లలో వృక్షసంపద ప్రాముఖ్యతను వివరించారు. చెట్లు నీడలో నారు మొక్కలు నాటడాన్ని చూపించారు. రెండో రోజు సండూర్‌లోని ధర్మపుర ఉద్యాన క్షేత్రాన్ని సందర్శించి మామిడి, జాక్‌ఫ్రూట్, కొబ్బరి తల్లిమొక్కల ఎంపికపై శిక్షణ ఇచ్చారు. మూడోరోజు మునీరాబాద్‌లోని హార్టికల్చర్ కళాశాలను సందర్శించి శిక్ష ణార్థులకు నర్సరీ మౌలిక సదుపాయాలు, ఔషధ మొక్కల పెంపకం పద్ధతులపై అవగాహన కల్పించారు. బళ్లారిలోని ఉద్యానవన శాఖ నర్సరీని సందర్శించి అలంకార మొక్కలు, పండ్ల మొక్కలలో అవలంబిస్తున్న పద్ధతులను తెలుసుకు న్నారు. ఉద్యానవన శాఖ సీనియర్ అసిస్టెంట్ డైరెక్టర్ యోగేశ్వర్ అలంకార మొక్కలు, వాటి ప్రాముఖ్యతను గురించి వివరించారు. జిల్లా పంచాయతీ సీని యర్ అసిస్టెంట్ రత్నప్రియ శాఖల పథకాలు, గ్రాంట్ల గురించి వివరించారు. కా ర్యక్రమంలో బెగల్‌తండా గ్రామానికి చెందిన 25మంది రైతులు పాల్గొన్నారు.



నర్సరీ నిర్వహణపై అవగాహన కల్పిస్తున్న ఉద్యానవన అధికారులు

ఎన్నికల యాప్‌లపై అవగాహన అవసరం

బళ్లారి సిటీ, మార్చి 15: ఎన్నికల యాప్‌లైన విహెచ్‌ఏ, సక్షమ్, సువిధా, సి.వి జిల్ 150 వంటి యాప్‌ల గురించి అవగాహన కల్పించాలని రాష్ట్ర నోడల్ అధికారి వస్త్రాద్ సూచించారు. జిల్లా పంచాయితీ హాల్‌లో శుక్రవారం జిల్లా స్వీప్ కమిటీ, తాలూకా స్వీప్ కమిటీ, బళ్లారి నగరంలోని పోలింగ్ కేంద్రాల బీఎల్‌ఓ సూపర్ వైజర్లు, జిల్లా తాలూకా స్వీప్ ట్రైనర్లతో జరిగిన ప్రగతి సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల లిటరసీ క్లబ్, పోలింగ్ కేంద్రాల్లో ఓటరు అవగాహన పత్రాల ద్వారా ప్రత్యేక స్వీప్ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి సారించాలని, సామాన్య ప్రజలు, సీని యర్ సిటీజన్లు, మహిళలు ఓటు వేసేందుకు తగిన ఏర్పాట్లు చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాస్వీప్ కమిటీ నోడల్ అధికారి ,జిల్లాపంచాయితీ ముఖ్య కార్యనిర్వహణాధికారి రాహుల్ శరణప్ప జిల్లాలోని పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు తీసుకుంటున్న చర్యల గురించి సవివరంగా సమావేశానికి వివరించారు. అనంతరం లోక్‌సభ ఎన్నికలు 2024కు సంబంధించి పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులను పరిశీలించారు. ఈ సందర్భంగా బళ్లారి తాలూకా లోని వివిధ పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. జీపీ చీఫ్ ప్లానింగ్ అధికారి వగేష్, నగరపాలక సంస్థ కమిషనర్ జి.ఖలీల్, తహసీల్దార్ గురురాజ్, తాలూకాపం చాయితీ ఈఓ మాదగిన బసప్ప తదితరులు పాల్గొన్నారు.

హోసూరు జోన్

లోక్‌సభ ఎన్నికలపై బీజేపీ కసరత్తు



సమావేశంలో పాల్గొన్న బీజేపీ నాయకులు

హోసూరు, మార్చి 15: లోక్‌సభ ఎన్నికల్లో పాటించాల్సిన వ్యూహాలపై హోసూరు మీరా మ హల్‌లో బీజేపీ మున్సిపల్ నిర్వాహకుల సమావేశం శుక్రవారం జరిగింది. మున్సిపల్ నాయ కులు మణికంఠన్, రమేశ్‌కన్నన్, నాగేంద్ర తంగరాజ్ ఆధ్వర్యం వహించారు. పార్టీ కృష్ణగిరి పార్లమెంటరీ ఎన్నికల నిర్వహణ కమిటీ ఇన్‌చార్జ్, రాష్ట్ర కార్యదర్శి వెంకటేశం, కృష్ణగిరి పార్ల మెంటరీ బాలకృష్ణన్, జిల్లా అధ్యక్షుడు నాగరాజ్ సూచనలు చేశారు. భారతదేశ కీర్తిని ప్రపం చస్థాయిలో చాటిన ఘనత ప్రధానమంత్రి నరేంద్రమోదీదన్నారు. పెట్రోల్‌పై రూ.15, డీజల్‌పై రూ.18 తగ్గించారన్నారు. అయోధ్యలో రామమందిరం నిర్మించి ఎట్టకేలకు దశాబ్దాల కల సాకారం చేశారన్నారు. ఆర్టికల్ 370 తొలగింపుతో కశ్మీర్‌లో శాంతి నెలకొల్పేలా చేశారన్నారు. కశ్మీరును ఉగ్రవాదర హిత రాష్ట్రంగా తీర్చిదిద్దారన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు అందేలా చేయడం ద్వారా ఎన్నికల్లో బీజేపీకి ప్రయోజనం దక్కేలా చేయాలన్నారు. బీజేపీ జిల్లా నాయకులు విజయకుమార్, శ్రీనివాసన్, మురుగన్, శకుంతల, ప్రవీణ్‌కుమార్, రాజశే ఖర్, టీమ్ డివిజన్ నిర్వాహకులు కస్తూరీ, వీరేంద్ర పాల్గొన్నారు.

రథోత్సవానికి కనీస ఏర్పాట్లు చేయాలి: అన్నాడీఎంకే



మాట్లాడుతున్న రాజు

హోసూరు, మార్చి 15: ఈనెల 25న హోసూరులో జరగనున్న మరగతాంబ సమేత చంద్రచూడేశ్వరస్వామి బ్రహ్మరథోత్సవానికి కనీస ఏర్పాట్లు కల్పించాలని అన్నాడీ ఎంకే తూర్పు ప్రాంతీయ కార్యదర్శి రాజు డిమాండ్ చేశారు. ఆయన శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ రథోత్సవానికి స్థానికులే కాకుండా తమిళనాడు, పొరుగున సరిహద్దులోని కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాల నుంచి కూడా భక్తులు వస్తారన్నారు. వారం రోజులపాటు సాగే ఉత్సవాల్లో సుమారు 20లక్షలమంది పాల్గొం టారన్నారు. తేరుపేట ప్రాంతంలో రోడ్డును బాగు చేయాలని, కాలువలు శుభ్రం చేయా లని కోరారు. ఇందుకు కార్పొరేషన్ అధికారులు చొరవ చూపాలన్నారు.

మాదకద్రవ్యాల వ్యసనంపై జాగృతి కల్పించే

అమిగో గ్యారేజ్

హోసూరు (సిప్‌కాట్) మార్చి 15: మాదకద్రవ్యాల వ్యసనం వల్ల కలిగే దుష్ప్రభావాలపై ప్రజల్లో ప్రత్యేకించి యువతలో చైతన్యం కల్పించేలా 'అమిగో గ్యారేజ్' సినిమా రూపొందించినట్టు దర్శకుడు ప్రశాంత్ నాగరాజన్ తెలిపారు. పూర్తిగా హోసూరు చుట్టుపక్కల ప్రాంతాల్లో చిత్రీకరించిన ఈ సినిమా తమిళనాడువ్యాప్తంగా శుక్రవారం విడుదలైంది. ఈ సందర్భంగా లక్ష్మీ థియేటర్ వద్ద నిర్మాత మురళీ శ్రీనివాసన్ మాట్లాడుతూ.. యువతలో చైతన్యం కల్పించే లక్ష్యంతో ఈ సినిమాను రూపొందించినట్టు తెలిపారు. మాస్టర్ మహేంద్రన్ చక్కగా నటించారన్నారు. తొలిరోజు ప్రేక్షకుల స్పందన బాగుందన్నారు.



థియేటర్ వద్ద సందడి ఇలా..

తాగునీటి సమస్యపై ఖాళీ బిందెలతో నిరసన



రాయచూరు 29వ వార్డులో ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న జనం

రాయచూరు, మార్చి 15 : నగరంలోని 29వ వార్డులో తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ రాష్ట్రీయ సమాజ పరివర్తన సమితి ఆధ్వర్యంలో శుక్రవారం ఖాళీ బిందెలతో ప్రదర్శన నిర్వహించారు. టిప్పుసుల్తాన్ గార్డెన్‌లో ఖాళీ బిందెల ప్రదర్శన చేపట్టిన వార్డు ప్రజలు నీటి సమస్య గురించి పలు సార్లు నగరసభ అధికారుల ముందుంచినా సమస్యను పరిష్కరించలేదని ఆరోపించారు. దీనికితోడు నగ రానికి తాగునీరందించే ప్రధాన పైప్‌లైన్‌ల నుంచి పరిశ్ర మల వారు అక్రమంగా నీటిని తరలిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. అధికారులు తక్షణం స్పందించి తాగునీటి సమస్యను పరిష్కరించకపోతే ఆందో ళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలి: మంత్రి భోసరాజు



అభివృద్ధి పనులకు భూమిపూజ చేస్తున్న మంత్రి భోసరాజు

రాయచూరు, మార్చి 15 : నగర ప్రజల సౌకర్యం కోసం చేపట్టిన అభి వృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తేవాలని రాష్ట్ర చిన్ననీటి పారుదల శాఖ మంత్రి ఎన్.ఎస్.భోసరాజు అన్నారు. నగరంలోని పలు వార్డుల్లో చేపట్టే సీసీ రోడ్డు, డ్రైనేజి తదితర పనులకు శుక్రవారం మంత్రి భూమిపూజ చేశారు. రెండవ వార్డు పరిధిలో రూ.2.65 కోట్ల ముఖ్య మంత్రి ప్రత్యేక నిధుల ద్వారా చేపట్టే పనులతో పాటు ఏడు, తొమ్మిది వార్డుల్లో దాదాపు రూ.4.26 కోట్లతో అభివృద్ధి పనులను చేపట్టనున్నట్లు మంత్రి వివరించారు. నగర సమగ్ర అభివృద్ధికి తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తున్నట్లు భోసరాజు తెలిపారు. ఉత్తర కర్ణాటకలోనే అతి పెద్ద వ్యాపార కేంద్రమైన రాయచూరు నగరాన్ని అన్నివిధాలుగా అభివృద్ధి చేయడంపై తాను ప్రత్యేక దృష్టి సారించినట్లు మంత్రి వివరించారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రయిట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాంచ్...

పొట్టి శ్రీరాములు (జయంతి)




ఆంధ్ర రాష్ట్ర సాధనకోసం ఆమరణ నిరాహారదీక్ష చేసి ప్రాణాలర్పించి అమరజీవియైన పొట్టి శ్రీరాములు 1901 మార్చి 16న అప్పటి మద్రాసు ప్రెసిడెన్సీ పరిధిలోని నెల్లూరు జిల్లా పడమటిపల్లిలో జన్మించారు. భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు కారకులు. గాంధీజీ బోధించిన సత్యం, అహింస, హరిజనోద్ధరణ అనే ఆశయాల కోసం జీవితాంతం కృషి చేసిన మహనీయుడు. 1952 డిసెంబరు 15న ఆశయసాధనలో ప్రాణాలర్పించి అమరజీవులయ్యారు. ఫలితంగా డిసెంబరు 19న ప్రత్యేకరాష్ట్రం ఏర్పాటు చేస్తూ అప్పటి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ ప్రకటించారు. ఆయన గౌరవార్థం 2000 మార్చి 16న పోస్టల్‌స్టాంపు విడుదల చేశారు.

ఆవుల సాంబశివరావు (జయంతి)



జస్టిస్ ఆవుల సాంబశివరావు 1917 మార్చి 16న గుంటూరు జిల్లా మూల్పూరు గ్రామంలో జన్మించారు. రాష్ట్ర మొట్టమొదటి లోకాయుక్తగా గుర్తింపు పొందారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగాను, ఆంధ్రా యూనివర్సిటీ వైస్ ఛాన్సెలర్‌గాను వ్యవహరించారు. 1966లో రెండవ గవర్నమెంట్ ప్లీడర్‌గా నియమితులయ్యై, 1967లో పర్మనెంట్ జడ్జిగా బాధ్యతలు చేపట్టిన ఘనత ఆయనది. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఏర్పాటు వెనుక ఆయన కృషి ఎంతో ఉంది. రాడికల్ హ్యూమనిస్ట్ భారత సంఘం అధ్యక్షుడిగా వ్యవహరించారు. ఇండియన్ రేషనలిస్ట్ పత్రిక సంపాదకులు, తెలుగు విద్యార్థి పత్రికలో రెండు దశాబ్దాలకుపైగా శీర్షికను నిర్వహించారు. 2003 జూలై 27న కన్నుమూశారు.

మునిపల్లె రాజు (జయంతి)



మునిపల్లె రాజుగా పేరొందిన మునిపల్లె బక్కరాజు 1925 మార్చి 16న గుంటూరు జిల్లా కాకుమాను మండలం గరికపాడు గ్రామంలో జన్మించారు. తెలుగు కథను సుసంపన్నం చేసిన ప్రఖ్యాత కథకుడు, రచయిత. తెలుగులో మేజిక్ రియలిజంలో మొదటగా రాసిన రచయిత ఆయనే. తెలుగు పండితుడు జమ్ముల మడక రామమూర్తి ప్రభావంతో సాహిత్యంలో ఆసక్తిని పెంపొందించుకున్నారు. 1943 నుంచి 83వరకు రక్షణ శాఖలోని ఇంజనీరింగ్ సర్వీసులో సర్వేయర్‌గా పని చేశారు. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు, గోపీచంద్ పురస్కారం తదితర అవార్డులు పొందారు. 2018 ఫిబ్రవరి 24న మరణించారు.

ఉషశ్రీ (జయంతి)



ఉషశ్రీ 1928 మార్చి 16న పశ్చిమగోదావరి జిల్లాలో జన్మించారు. ఈయన అసలు పేరు పురాణపండ సూర్య ప్రకాశ దీక్షితులు. ఆకాశవాణి విజయవాడ కేంద్రంలో ఆయన చేపట్టిన 'ధర్మసందేహాలు' కార్యక్రమం ఎంతో పేరొందింది. తర్వాత వారంవారం రామాయణ, మహాభారతాలను ఆకాశవాణి నుంచి ప్రవచనం చేశారు. రేడియో వ్యాఖ్యాత, సాహితీ రచయితగా రాణించిన ఉషశ్రీచే టీటీడీ ఈఓగా పీవీఆర్‌కే ప్రసాద్ హయాంలో భాగవతం రాయించి పాతికవేల కాపీలు ముద్రించి తక్కువధరకే భక్తులకు అందించారు. 1990 సెప్టెంబరు 7న కన్నుమూశారు.

శ్రీరంగం గోపాలరత్నం (వర్ధంతి)



'పద్మశ్రీ' గ్రహీత శ్రీరంగం గోపాలరత్నం 1939 విజయనగరం జిల్లా పుష్పగిరిలో జన్మించారు. అద్భుతమైన గాత్రంతో 'మధుర గాయని'గా పేరొందారు. కూచిపూడి, యక్షగాన, జావాలి, ఎంకి పాటలు ఆలపించడంలో పేరొందారు. ఆలిండియా రేడియోలో 'భక్తి రంజని' కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేవారు. ఆర్టిస్టుగా, హైదరాబాద్‌లోని గవర్నమెంట్ మ్యూజిక్ కాలేజ్ ప్రిన్సిపాల్, తెలుగు యూనివర్శిటీ ప్రొఫెసర్, డీన్‌గా వ్యవహరించారు. టీటీడీ ఆస్థాన విదూషిగా రాణించారు. 1993 మార్చి 16న కన్నుమూశారు.

రాగాల వెంకట రాహుల్ (పుట్టినరోజు)



రాగాల వెంకటరాహుల్ 1997 మార్చి 16న గుంటూరు జిల్లా స్టూవర్టుపురంలో జన్మించారు. సమ్మర్ యూత్ ఒలింపిక్స్‌లో అద్భుత ప్రతిభను కనబరిచారు. 2014 టోర్నీలో భారత్‌కు తొలి పతకాన్ని అందించారు. 2014లో చైనా దేశం నాన్‌జింగ్‌లో జరిగిన వెయిట్‌లిఫ్టింగ్ 77కిలోల విభాగంలో రజత పతకాన్ని సాధించారు. ఆస్ట్రేలియా దేశం గోల్డ్‌కోస్ట్‌లో 2018 కామన్వెల్త్ పోటీలలో 85కిలోల విభాగంలో బంగారుపతకం సాధించారు. 2022 ఫిబ్రవరిలో సింగపూర్‌లో జరిగిన ఇంటర్నేషనల్ పోటీల్లో 96 కిలోల విభాగంలో కాంస్యపతకం సాధించారు.

పౌష్టికాహారంతోపాటు వ్యాయామం అవసరం

మహదేవపుర, మార్చి 15 : ఉత్తమ ఆరోగ్యం కోసం పౌష్టికాహారాన్ని ఆరగించడంతోపాటు శరీరానికి తగినంత వ్యాయామం అవసరమని ఎమ్మెల్యే మంజుళా లింబావళి అభిప్రాయపడ్డారు. నియోజకవర్గంలోని కే దొమ్మసంద్ర గ్రామంలో బయలు వ్యాయామ కేంద్రాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉత్తమ ఆరోగ్య అలవాట్లతోనే శరీరానికి తగినంత శక్తి లభిస్తుందన్నారు. శరీరధారుడ్యాన్ని కాపాడుకునేందుకు తగినంత వ్యాయాయం చేయాల్సి ఉందన్నారు. ప్రజలు ఈ వ్యాయామకేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇటీవలి కాలంలో ప్రజలకు ఆరోగ్యంపైనా, వ్యాయామంపైనా ఆసక్తి పెరిగిందన్నారు. నడక, ఆసనాలు, ధ్యానం, సైక్లింగ్ వంటి వాటిలో ఏదో ఒకటి అలవాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ గ్రామీణ అధ్యక్షుడు నటరాజ్, శిగే హళ్ళి గ్రామ పంచాయతీ అధ్యక్షురాలు మంగళా, ఉపాధ్యక్షుడు సురేశ్ బాబు, సభ్యులు మధు, సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నామఫలకాలలో 60శాతం కన్నడ అమలు

దొడ్డబళ్ళాపుర, మార్చి 15: దుకాణాలు, ఇతర సంస్థల నామఫలకాలలో 60శాతం కన్నడను తప్పనిసరిగా అమలు చేయాలని కన్నడ సంఘాల సమాఖ్య నేతృత్వంలో శుక్రవారం అభియాన నిర్వహించారు. ఈ సందర్భంగా సమాఖ్య ప్రముఖులు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా పలు రాష్ట్రాలు, భాషలకు చెందిన వారు జీవనోపాధికి వచ్చారన్నారు. ప్రత్యేకించి చేనేత రంగంలో వేలాదిమంది ఉన్నారన్నారు. అదే రీతి బాశెట్టిహళ్ళి పారిశ్రామికవాడలో, కట్టడ కార్మికులు పెద్దసంఖ్యలో ఉన్నారన్నారు. ఇక్కడ కన్నడిగులకు లభించాల్సిన సదుపాయాలు ఇతర రాష్ట్రాలవారికి దక్కుతున్నాయని ఆరోపించారు. పలు చోట్ల నామఫలకాలలో 60శాతం కన్నడ అమలు కాలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇకనైనా అమలు చేయాలన్నారు. నగరసభ అధికారులు కూడా సరైన చొరవ చూపాల్సి ఉందన్నారు. నామఫలకాలలో పూర్తిగా కన్నడ వినియోగించినవారిని అభినందించారు. నియాలు పాటించనివారికి 15 రోజులు అవకాశం ఇచ్చి అమలు చేయాలని లేనిపక్షంలో చట్టరీత్యా చర్యలను ఎదుర్కొనాల్సి ఉంటుందని హెచ్చరించారు. నెలదాంజనేయస్వామి దేవస్థానం నుంచి పురవీధులలో ఊరేగింపుగా సాగి దుకాణదారులకు, ప్రజలకు కరపత్రాలను పంపిణీ చేసి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రాష్ట్ర విజయ కర్ణాటక రక్షణా వేదిక, కర్ణాటక పత్రకర్తర క్షేమాభివృద్ధి సంఘం, కన్నడ జాగృతి వేదిక, జయ కర్ణాటక, కేఆర్ఎస్ పక్ష, మహా కర్ణాటక సమాజసేవా సంఘం, డాక్టర్ విష్ణు సేనా సమితి, ధ్రువసర్జా అభిమాని సంఘం, కర్ణాటక నవ నిర్మాణ సేన, కర్ణాటక దళిత సంఘర్ష సమితి, కర్ణాటక దళిత సింహగర్జన తదితర సంఘాల పదాదికారులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ర్యాలీగా సాగుతున్న కన్నడ సంఘాల పదాధికారులు

కేఐఏడీబీలో కేటాయింపులో అక్రమాలు

» సమగ్ర దర్యాప్తునకు డిమాండ్



భీమ్ ఆర్మీ భారత్ ఏక్తా మిషన్ రాష్ట్ర అధ్యక్షుడు రాజగోపాల్ తదితరులు

బెంగళూరు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక పారిశ్రామిక ప్రదేశ అభివృద్ధి మండలి (కేఐఏడీబీ) ఆధ్వర్యంలో ఇండస్ట్రియల్ లే అవుట్‌ల నిర్మాణంలో నిబంధనలను పూర్తిగా తుంగలోకి తొక్కారని భీమ్ ఆర్మీ భారత్ ఏక్తా మిషన్ ఆరోపించింది. సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు డీ రాజగోపాల్ నగరంలో శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ రియల్ ఎస్టేట్ కంపెనీలతో వందలాది ఎకరాల భూములను అడ్డగోలుగా పంపిణీ చేశారన్నారు. రియల్ ఎస్టేట్ కంపెనీలు పరిశ్రమలు నిర్వహిస్తున్నారా..? అవి ఏ పరిశ్రమలో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. కేఐఏడీబీ నియమాలను ఉల్లంఘించడం ద్వారా ఖజానాకు వేల కోట్ల రూపాయల నష్టం వాటిల్లుతోందన్నారు. ప్లాన్‌లను పదే పదే మార్చి చివరకు కనీసం మౌలిక సదుపాయాలకు అవకాశం లేకుండా కేటాయింపులు చేశారన్నారు. ఇందుకు సంబంధించిన కొన్ని ఆధారాలను మీడియాకు విడుదల చేశారు. ఈ మొత్తం వ్యవహారంలో అక్రమాలు చోటు చేసుకున్నాయని సమగ్ర విచారణ జరిపితే నిజాలు వెలుగు చూస్తాయన్నారు. మీడియా సమావేశంలో సంఘం పదాధికారులు పాల్గొన్నారు.

ఇళ్ల నడుమ బార్‌కు అనుమతిపై నిరసన

శిడ్లఘట్ట, మార్చి 15: తాలూకా జంగమకోటె హోబళి దేవనహళ్ళి సమీపాన కనకనగర్‌లో బార్ అండ్ రెస్టారెంట్ ఏర్పాటుకు అనుమతి ఇవ్వడాన్ని ఖండిస్తూ స్థానికులు నిరసన తెలిపారు. రైతు సంఘం ఆధ్వర్యంలో నిరసన సాగింది. వసతి ప్రదేశాల నడుమ ఎట్టి పరిస్థితుల్లోనూ బార్ అండ్ రెస్టారెంట్ (సీఎల్7) తెరవరాదని పలుమార్లు అధికారులను కోరినా అనుమతి ఇవ్వడంపై స్థానికులు ఆక్రోశం వ్యక్తం చేశారు. అబ్కారీశాఖ అధికారుల తీరును ఖండించారు. వెంటనే బార్ అనుమతులను రద్దు చేయాలని లేనిపక్షంలో తీవ్ర పోరాటం తప్పదని రైతుసంఘం సభ్యులు, స్థానికులు హెచ్చరించారు. స్థానిక అబ్కారి శాఖ చింతామణి విభాగం అధికారి సురేశ్, నేత్రావతిలు చేరుకుని ఆందోళనకారులనుంచి వినతిపత్రం స్వీకరించారు. ఉన్నతాధికారులకు సమాచారం ఇస్తామని ఆందోళన వీడాలని కోరారు. నిరసనలో తాలూకా అధ్యక్షుడు తాదూరు మంజునాథ్, జిల్లా ఉపాధ్యక్షుడు వీరాపుర మునినంజప్ప, సుంద్రహళ్ళి బీరప్ప, ఆంజేనేయరెడ్డి, ఎం వెంకటరమణస్వామి, కృష్ణప్ప, స్థానికులు లలితమ్మ, పుష్ప, రుక్మిణి, లక్ష్మి, మంజుళమ్మ, లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.



కనకనగర్ వాసుల నిరసన

రంజాన్ ఉపవాసాల వేళ...

హలీంకు విశేష ఆదరణ

బెంగళూరు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): గార్డెన్‌సిటీ బెంగళూరు నగర ప్రజలకు 2011లోనే హైదరాబాద్ హలీంను పరిచయం చేసిన ఘనత పిస్తాహౌస్‌కే దక్కుతుంది. అనంతరం ఈ రంగంలోకి చాలా మంది అడుగు పెట్టినా పిస్తాహౌస్ హలీంకు ఆదరణ చెక్కు చెదరలేదు. రంజాన్ మాసం సందర్భంగా బెంగళూరులో హలీం తయారీ ప్రక్రియకు శ్రీకారం చుట్టిన సందర్భంగా నగరంలోని కేంద్రీకృత వంటశాలలో శుక్రవారం సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఎం షఫీక్ అహ్మద్ మీడియాతో మాట్లాడారు. హలీం తయారీకి రమారమి 16 గంటల సమయం పడుతుంది. హలీం తయారీకి అవసరమైన నాణ్యమైన గోధుమలు, స్వచ్ఛమైన నెయ్యితో పాటు మసాలా దినుసులు, డ్రైఫ్రూట్స్ తామే సొంతంగా సిద్ధం చేసుకుంటామని పొట్టేళ్ళు మాత్రమే స్థానికంగా కొనుగోలు చేస్తామని ఆయన చెప్పారు. హలీంలో 28 శాతానికి పైగా ప్రొటీన్లు ఉన్నట్లు శాస్త్రీయంగా రుజువైందన్నారు. ఇది గొప్ప రోగనిరోధక శక్తిలా పని చేస్తుందన్నారు. హలీం తయారీలో ఆరితేరిన 40 మంది పాకనిపుణులు కూడా హైదరాబాద్ నుంచే వచ్చారన్నారు. శివాజీనగర్ ఇన్‌ఫాంటరీ రోడ్డులోని వంటశాలలో 8 పెద్దపెద్ద కుండీలను హలీం తయారీకోసం సిద్ధంచేసి ఉంచామని ప్రస్తుతం రెండు మూడు కుండీలలోనే రోజుకు తలా వంద కిలోల చొప్పున హలీం సిద్ధమవుతోందన్నారు. డిమాండ్‌ను బట్టి పెంచుకుంటామని షఫీక్ అహ్మద్ వివరించారు. ఫ్రేజర్ టౌన్ మసీదు ఎదురుగా సిఎంఎ హాల్‌లో హలీం ప్రధాన విక్రయ కేంద్రం పనిచేస్తోందని ఇవి గాక నగరవ్యాప్తంగా 60 అవుట్‌లెట్లు పనిచేస్తున్నాయన్నారు. ఈ ఏడాది కిలోన్నర గిఫ్ట్‌బాక్సులను పరిచయం చేశామని వీటికి భారీగా డిమాండ్ ఉందన్నారు. ఐఎస్ఐ గ్రేడ్‌కలిగిన ఈ హలీం పలు దేశాలకు ఎగుమతి కూడా అవుతోందని ఆయన వెల్లడించారు.



బెంగళూరులోని కేంద్రీకృత వంటశాలలో ఎం.షఫీక్ అహ్మద్

కాంగ్రెస్, బీజేపీ పేదలకు చేసిందేమీ లేదు

» బీఎస్పీ అభ్యర్థి సురేశ్

బంగారపేట, మార్చి 15: దేశాన్ని పాలించిన కాంగ్రెస్, బీజేపీలు పేదల సంక్షేమానికి చేసిందేమీ లేదని బహుజన సమాజ్‌పార్టీ కోలారు అభ్యర్థి సురేశ్ ఆరోపించారు. పట్టణంలోని అంబేడ్కర్ భవనంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ దళితులు, మైనారిటీలు, వెనుకబడినవర్గాలకు జాతీయ పార్టీలు చేసింది శూన్యమన్నారు. పేదరిక నిర్మూలన చేస్తామని గొప్పలు చెప్పారని అమలులో విఫలమయ్యారన్నారు. ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో బహుజన సమాజ్ పార్టీ మూడో అతిపెద్ద పార్టీగా అవతరించనుందన్నారు. స్వతంత్ర భారతదేశంలో ఆరు దశాబ్దాలపాటు కాంగ్రెస్ పాలన సాగించిందని, దళిత, మైనారిటీ, వెనుకబడిన వర్గాల సంక్షేమంలో విఫలమైందన్నారు. కేవలం ఓటు బ్యాంకుగానే ఈ వర్గాన్ని పరిగణించాయని ఆరోపించారు. బీజేపీ ఇచ్చిన హామీలు అమలు కాలేదన్నారు. దేశంలో ఇంకా 35శాతం పేదరికం ఉందని ఇది అభివృద్ధికి ఆటంకంగా మారిందన్నారు. ఈ సందర్భంగా బీఎస్పీ తాలూకా అధ్యక్షుడు అంబరీశ్, జిల్లా ఉపాధ్యక్షుడు రమేశ్‌కుమార్, రమేశ్, శ్రీనివాస్, నారాయణస్వామి, రాజణ్ణ తదితరులు పాల్గొన్నారు.



మీడియా సమావేశంలో బీఎస్పీ అభ్యర్థి సురేశ్ తదితరులు

బాల్యవివాహాల నియంత్రణపై జాగృతి



పాల్గొన్న వివిధ శాఖల అధికారులు

బాగేపల్లి, మార్చి 15: తాలూకా పంచాయతీ, జిల్లా పంచాయతీ, స్త్రీ శిశు సంక్షేమ అభివృద్ధిశాఖ, గ్రామపంచాయతీ, విద్యాశాఖ సంయుక్త ఆధ్వర్యంలో బాలికా రక్షణ పథకంలో భాగంగా గ్రామపంచాయతీ స్థాయిలో జాగృతి చేపట్టారు. ఘంటంవారిపల్లి ప్రభుత్వ హైస్కూల్‌లో లింగ నిర్ధారణ, స్త్రీ భ్రూణ హత్య నియంత్రణ, పోక్సోచట్టం, బాలకార్మిక నియంత్రణ చట్టాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. రీసోర్స్‌సెంటర్ కుశల్‌కుమార్ మాట్లాడుతూ బాలికా విద్య ప్రోత్సాహక ఆవశ్యకతను వివరించారు. లింగ పక్షపాత ధోరణి సరికాదన్నారు. బేటి బచావో బేటి పడావో పథకం ప్రాధాన్యతను వివరించారు. స్త్రీ శిశుసంక్షేమ అధికారి సుమాదేవి మాట్లాడుతూ బాలికల హక్కులు, విద్య ఆవశ్యతను తెలిపారు. వారి ఆరోగ్యం, పౌష్టికాహార ప్రాధాన్యతను వివరించారు. సమాజంలో బాలికలకు ఉన్నత గౌరవం లభించాలంటే అది విద్య, చక్కటి ఆరోగ్యంతోనే సాధ్యమన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు జీ రామసుబ్బమ్మ, ఉపాధ్యాయులు సంధ్యా, సీ నారాయణస్వామి, ఎల్ రవి, మంజుళా విద్యార్థులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో రాఘవేంద్రస్వామి ఆరాధన

శిడ్లఘట్ట, మార్చి 15: పట్టణంలోని శామణ్ణబావి సమీపానగల గురు రాఘవేంద్రస్వామి ఆరాధన మహోత్సవం రెండు రోజులపాటు గురు, శుక్రవారాలలో ఘనంగా జరిగింది. భక్తిశ్రద్ధలతో జరిగిన కార్యక్రమాల్లో పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు విశేష కార్యక్రమాలు సాగాయి. అభిషేకం, అలంకరణ అనంతరం భక్తులందరికీ తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షులు ఎస్‌వీ నాగరాజరావ్, వాసుదేవరావ్, శ్రీకాంత్, కృష్ణమూర్తి, విశ్రాంత ఉపాధ్యాయుడు కృష్ణ, మంజునాథ్, పెద్ద సంఖ్యలో భక్తులు తదితరులు పాల్గొన్నారు.



ఉత్సవంలో పాల్గొన్న భక్తులు

పలు అభివృద్ధి పనులకు భూమిపూజ

హెబ్బాళ్, మార్చి 15: ముఖ్యమంత్రి అమృత నగరోత్థాన పథకం కింద గంగానగర్ వార్డు 5వ మెయిన్‌రోడ్డు సహా పలు వీధుల రోడ్డు డాంబరీకరణ తదితర పనులను నగరాభివృద్ధిశాఖ మంత్రి బైరతి సురేశ్ లాంచనంగా ప్రారంభించారు. శుక్రవారం పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. హెచ్ఎంటీ మైదానం, లక్ష్మయ్య బ్లాక్, హెబ్బాళ్ ఏ బ్లాక్, ఇందిరా బ్లాక్, వినాయక లే అవుట్, కుంతిగ్రామ, సంజయ్‌నగర్ వార్డు భూపసంద్ర బస్టాండ్ తదితర ప్రాంతాల్లో డాంబరీకరణ, డ్రైనేజీ అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్‌లు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, వార్డు కాంగ్రెస్ అధ్యక్షులు, డీసీసీ పదాధికారులు తదితరులు పాల్గొన్నారు.



భూమిపూజలో మంత్రి బైరతి సురేశ్ తదితరులు

హోలీ పండుగ వేళ మూడు ప్రత్యేక రైళ్లు

బెంగళూరు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): హోలీ పండుగను పురస్కరించుకుని ప్రయాణీకుల రద్దీని తట్టుకునేందుకు వీలుగా నైరుతి రైల్వేజోన్ 3 ప్రత్యేక రైళ్ళను నడుపనుంది. బెంగళూరు ఎస్ఎంవిటి - కొచువేలి స్టేషన్‌ల మధ్య రెండు ట్రిప్పులు, ఎస్ఎంవిటి-కణ్ణూరుల మధ్య రెండు ట్రిప్పులు, హుబ్బళ్ళి- అహ్మదాబాద్‌ల మధ్య ఒక ట్రిప్పు చొప్పున ఈ ప్రత్యేక రైళ్ళు సంచరించనున్నాయి. ఈ నెల 19, 26 తేదీలలో ఎస్ఎంవీటీ - కణ్ణూరు రైలు రాత్రి 11.55కు బయల్దేరి మరుసటి రోజు మధ్యాహ్నం కణ్ణూరుకు చేరుకుంటుంది. కణ్ణూరు నుంచి మార్చి 20, 27 తేదీలలో రాత్రి 8 గంటలకు బయల్దేరి మరుసటి రోజు మధ్యాహ్నం 1 గంటకు ఎస్ఎంవీటీ స్టేషన్‌కు చేరుకోనుంది. ఎస్ఎంవిటి -కొచువేలి స్టేషన్‌ల మధ్య ఈ నెల 23, 30 తేదీలలో ప్రత్యేక రైలు సంచారం ప్రారంభం కానుంది. రాత్రి 11.55కు ఎస్ఎంవీటీలో బయల్దేరి మరుసటి రోజు ఉదయం 7.10 గంటలకు కొచువేలి చేరుకుంటుంది. మార్చి 24, 31 తేదీలలో కొచువేలి నుండి రాత్రి 10 గంటలకు బయల్దేరి మరుసటి రోజు సాయంత్రం 4.30 గంటలకు ఎస్ఎంవీటీ చేరుకుంటుంది. కాగా హుబ్బళ్ళి- అహ్మదాబాద్‌ల మధ్య ప్రత్యేక రైలు ఈ నెల 24న సంచరించనుంది. ఈ రైలు హుబ్బళ్ళిలో రాత్రి 7.30కు బయల్దేరి మరుసటి రోజు సాయంత్రం 7.20కు అహ్మదాబాద్‌కు చేరుకుంటుంది. మార్చి 25న అహ్మదాబాద్ నుంచి రాత్రి 9.25కు బయల్దేరి మరుసటి రోజు సాయంత్రం 7.45కు ఎస్ఎంవీటీ స్టేషన్‌కు చేరుకుంటుంది. ఈ ప్రత్యేక రైళ్ళకు రిజర్వేషన్ల బుకింగ్ జరుగుతోందని ప్రయాణీకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నగరంలో శుక్రవారం విడుదలైన ప్రకటన పేర్కొంది.

మాజీ మంత్రి రమేశ్‌జార్కిహొళికి ఊరట

బెంగళూరు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): అపెక్స్‌బ్యాంకు నుంచి రుణాలు తీసుకుని చెల్లించని వివాదంలో మాజీ మంత్రి రమేశ్ జార్కిహొళిని అరెస్టు చేయరాదని హైకోర్టు ధర్మాసనం శుక్రవారం సూచించడంతో ఆయనకు భారీ ఊరట లభించినట్టయ్యింది. సహకార బ్యాంకులకు మోసం చేశారని అధికారులు దాఖలు చేసిన పిటీషన్‌ను కొట్టివేయాలని మాజీ మంత్రి కోర్టును ఆశ్రయించారు. అయితే ప్రభుత్వ న్యాయవాది, మాజీ మంత్రి రమేశ్ జార్కిహొళి పిటీషన్‌పై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. దర్యాప్తు చేస్తున్న సీఐడీకి సహకరించలేదని, నోటీసులు ఇచ్చినా హాజరు కావడం లేదని కోర్టుకు విన్నవించారు. మాజీ మంత్రి రమేశ్ జార్కిహొళి తరపు వాదనలు విన్న ధర్మాసనం చివరకు అరెస్టు చేయరాదని సూచించింది. అయితే సీఐడీ దర్యాప్తుకు సంపూర్ణంగా సహకరించాలని రమేశ్‌జార్కిహొళికి సూచించింది. సౌభాగ్యలక్ష్మి షుగర్స్ కంపెనీ కోసం అపెక్స్ బ్యాంకు నుంచి రూ.232.88 కోట్లు రమేశ్‌జార్కిహొళి రుణం తీసుకున్నారు. సకాలంలో చెల్లించకపోవడంతో క్రిమినల్ కేసు నమోదు చేశారు.

ఆదిచుంచనగిరి మఠాధిపతితో బీజేపీ అభ్యర్థుల భేటీ

బెంగళూరు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ఆదిచుంచనగిరి మఠాధిపతి నిర్మలానంద నాథ స్వామిజీని నగరంలో శుక్రవారం బీజేపీ అభ్యర్థులు పీసీ మోహన్, శోభా కరంద్లాజె భేటీ అయ్యారు. ఈ సందర్భంగా స్వామిజీ ఆశీస్సులను అందుకున్నారు.



స్వామిజీ ఆశీస్సులు అందుకుంటున్న బీజేపీ అభ్యర్థులు

కుండలకు పెరుగుతున్న డిమాండ్

చేళూరు, మార్చి 15: ఎండలు క్రమేపీ పెరుగుతుండడంతో దాహార్తిని తీర్చుకోవడానికి చల్లటి నీరు, మజ్జిగ, కొబ్బరిబోండా తాగుతుంటారు. చల్లటి నీరు కోసం పేదవాడి ఫ్రిజ్‌గా పేరొందిన కడవలకు క్రమేపీ డిమాండ్ పెరుగుతోంది. గ్రామాలతోపాటు పట్టణాలలో కూడా కుండలో వాడుతుంటారు. కుండపై ఒక బట్టను కప్పి కొద్దిగా నీరు చల్లడం ద్వారా కుండలోని నీరు మరింత చల్లదనంగా ఉంటుంది. మట్టికుండలో సహజసిద్ధమైన చల్లదనంతో కూడిన నీటిని తాగడం వల్ల ఎటువంటి దుష్ప్రభావాలు ఉండవు. ఈ తరుణంలో రెండు మూడు సైజుల్లో విక్రయిస్తున్న కుండలకు డిమాండ్ ఉంది. తాలూకా కేంద్రమైన కొన్ని కూడళ్లలోనూ కుండల విక్రయం క్రమేపీ పెరుగుతోంది.



విక్రయానికి సిద్ధంగా ఉన్న కడవలు

ట్రక్ టెర్మినల్ అధ్యక్షుడిగా రమేష్‌బాబు

బెంగళూరు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): కేపీసీసీ అధికార ప్రతినిధిగా వ్యవహరిస్తున్న రమేష్‌బాబును దేవరాజ అరసు ట్రక్ టెర్మినల్ అధ్యక్షుడిగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కేబినెట్ హోదా కలిగిన ఈ పదవిలో రమేష్‌బాబు రెండేళ్ళపాటు కొనసాగనున్నారు. కాగా ప్రభుత్వం తనకు ఇచ్చిన బాధ్యతను చిత్తశుద్ధితో నెరవేరుస్తానని రమేష్‌బాబు నగరంలో శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు.



రమేష్‌బాబు

డైయింగ్ యూనిట్‌పై అధికారుల దాడి



తనిఖీలో పాల్గొన్న అధికారుల బృందం

దొమ్మసంద్ర, మార్చి 15: అక్రమంగా డైయింగ్, కలరింగ్ చేస్తున్నారన్న ఫిర్యాదుల నేపథ్యంలో పర్యావరణ విభాగం, తాలూకా రెవెన్యూ అధికారులు గురువారం దాడి చేశారు. పోలీసు, బెస్కాం అధికారులు కూడా పాల్గొన్నారు. తమిళనాడుకు చెందిన సుబ్రమణి, కలరింగ్ ఫ్యాక్టరీ నిర్వహిస్తున్నాడు. ఫ్యాక్టరీల వ్యర్థాలను పైపుల ద్వారా భూమిలోకి వదులుతున్నాడు. కలరింగ్‌కు ఉపయోగిస్తున్న డ్రమ్‌లు, చీరలను స్వాధీనం చేసుకున్నారు. మణసినహళ్ళి గ్రామపంచాయతీ చుట్టుపక్కల సాగుతున్న అక్రమ డైయింగ్, కలరింగ్ అడ్డాలపై దాడులు కొనసాగాయి. సుబ్రమణి, రాజీవ్‌గాంధి, విశాల్ సహా ఏడుగురిపై ఆనేకల్ పోలీస్ స్టేషన్‌లో పీడీఓ ఫిర్యాదు చేశారు. కాలుష్యనియంత్రణ అధికారి నారాయణస్వామి, తాలూకా అధికారి అశోక్, రెవెన్యూ శాఖ అధికారులు శుక్రవారం కూడా కార్యాచరణ కొనసాగించాయి.

జింక మాంసం స్వాధీనం : ముగ్గురి అరెస్టు

బాగేపల్లి, మార్చి 15: జింకమాంసాన్ని తరలిస్తున్న ముగ్గురిని పోలీసులు అరెస్టు చేసి అటవీశాఖ అధికారులకు అప్పగించారు. తాలూకాలోని కొండరెడ్డిపల్లి గ్రామం మెయిన్‌రోడ్డుపై బుధవారం అర్ధరాత్రి గొడవ చోటు చేసుకోగా స్థానికులు ఫిర్యాదు చేశారు. పోలీసులు అక్కడికి చేరుకుని విచారించగా సుమారు 15 కేజీల జింకమాంసం ఉన్నట్టు గుర్తించారు. సందేశ్ (32), వెంకటేశ్ (42), కృష్ణప్ప (33)లను అదుపులోకి తీసుకుని అటవీశాఖ అధికారులకు అప్పగించారు. వీరంతా తాలూకాలోని కానగమాకలపల్లి గ్రామపంచాయతీ సోలమాకలపల్లి వాసులుగా గుర్తించారు. నిందితులనుంచి మూడు మొబైల్ ఫోన్లు, రూ.5,710 నగదు, ఒక ద్విచక్రవాహనం, ఒక మచ్చు, 2 చాకులను స్వాధీనం చేసుకున్నారు. ప్రాంతీయ అటవీశాఖ అధికారి చంద్రశేఖర్ మాట్లాడుతూ వన్యజీవులను వేటాడడం నిషేధించదని అయినా ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయన్నారు. నిందితులను గురువారం కోర్టులో హాజరుపరిచామని తెలిపారు.



పట్టుబడిన నిందితులు